సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 30 । జూలై । 2024



సోమశిలలో 9.546 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 9.546 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్‌ డెల్టాకు, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.70,970
22 క్యారెట్లు ఆర్నమెంట్‌ (1 గ్రా)	రూ.6,339
3శాతం జీఎస్టీతో	రూ.6,529
నవర (8గ్రా)	రూ.52,232

గరిష్టం/కనిష్టం
37.2 /29.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణంలో తేమ 51 శాతం ఉంది.

న్యూస్‌రీల్‌

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలంటూ సీపీఎం నేతల ధర్నా



ధర్నాలో చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్‌): వెంకటేశ్వరపురంలో నిర్మించిన ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి కుంగిపోయి 20 రోజులైనా మరమ్మతులు చేయలేదని, వారం రోజుల్లో పనులు పూర్తి చేయకపోతే ఆందోళనలు చేపడతామని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం సాలుచింతలు సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలోని 53వ డివిజన్‌ పరిధిలోని వెంకటేశ్వరపురంలో నిర్మించిన ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి కుంగి 20 రోజులు అయ్యిందని అన్నారు. దీంతో ఆ రహదారిని మూసి వేయడంతో వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి మరమ్మతులు చేపట్టకపోతే సీపీఎం నిరవధిక ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, నెల్లూరు, కోవూరు సీపీఎం నాయకులు చాన్‌ బాషా, మూలం ప్రసాద్‌, పద్మ, వేణు, అశోక్‌, వెంకటేశ్వర్లు, జాఫర్‌, కాలేషా, నజీర్‌, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ల్యాబ్‌లు, స్కాన్‌ సెంటర్లలో తనిఖీ



ల్యాబ్‌లో తనిఖీలు చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పి.బ్రిజిత

కావలి: కావలిలో వివిధ రకాల పరీక్షలకు సంబంధించి ల్యాబ్‌లు, స్కాన్‌ సెంటర్లను డిప్యూటీ డీఎంఅండ్‌ హెచ్‌ఓ పి.బ్రిజిత సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్‌లకు సంబంధించిన పలు మోసాల గురించి తమ దృష్టికి వచ్చిందన్నారు. ల్యాబ్‌ల యాజమాన్యాలు ఏఏ పరీక్షలకు ఎంత వసూలు చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌ ఉందా లేదా? పరీక్షలు డాక్టర్‌ సలహాలతోనే చేస్తున్నారా? అనే అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అధిక మొత్తంలో నగదు వసూలు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కాన్‌ సెంటర్లను కూడా తనిఖీ చేసి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే హాస్పిటల్‌ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని తెలిపారు.

బస్సు టైరు పంక్చరై..

- గంటల తరబడి ప్రయాణికుల నిరీక్షణ



ఆర్టీసీ బస్సు వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మర్రిపాడు: బస్సు టైరు పంక్చర్‌ కావడంతో వాటిని మార్చేందుకు అవసరమైన పరికరాలు లేక గంటల తరబడి ప్రయాణికులు రోడ్డుపై నిరీక్షించాల్సిన పరిస్థితి సోమవారం మండలంలోని పెద్దమాచనూరు స్టేజ్‌ వద్ద చోటు చేసుకుంది. ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నెల్లూరుకు వెళుతుండగా ముందు టైర్‌ పంచర్‌ అయింది. అయితే బస్సులో టైర్‌ మార్చేందుకు పరికరాలు లేకపోవడంతో బస్సులోని 38 మంది ప్రయాణికులు రోడ్డుపై రెండు గంటల సమయానికిపైగా నిరీక్షించాల్సి వచ్చింది. పలువురు ప్రయాణికులు ఆర్టీసీ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత వేరే బస్సులో ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపించారు.

వర్సిటీలో రికార్డులు పరిశీలించిన వీసీ

సాక్షి ఎఫెక్ట్‌..

నెల్లూరు (టౌన్‌): విక్రమ సింహపురి యూనివర్సిటీలోని కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్‌ విభాగంలో వైస్‌ చాన్సలర్‌ విజయభాస్కరరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆదివారం సాక్షిలో 'పట్టభద్రులకు పరీక్ష' శీర్షిక ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రికార్డులు, ఫైళ్లను పరిశీలించారు. తరచుగా సర్టిఫికెట్లలో తప్పులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. మార్కులిస్టులు, ప్రొవిజనల్స్‌, కాన్వొకేషన్ల కోసం వచ్చే విద్యార్థులకు సానుకూలంగా సమాధానం చెప్పాలన్నారు. సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. మంగళవారం కూడా ఈ విభాగం అధికారులతో సమీక్షించనున్నారు.

రేషన్‌ షాపులపై టీడీపీ దందా

- డీలర్లు రాజీనామా చేయాలంటూ బెదిరింపులు
- లొంగని డీలర్లపై ఫోర్జరీ సంతకాలతో కుట్రలు
- ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ కీలక పాత్ర
- కోర్టులో తేల్చుకుంటామంటున్న డీలర్లు
- కందుకూరులో అధికార పార్టీ నేతల దుర్మార్గం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో అధికారం మార్పుతో రేషన్‌షాపులు, ఫీల్డ్‌ అసిస్టెంట్ల వంటి చిరు ఉద్యోగులకు వేధింపులు తప్పడం లేదు. అధికారమే అండగా వారిని ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారు. కందుకూరులో అధికార పార్టీ నేతలు రేషన్‌ షాపులపై సాగిస్తున్న దందానే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రేషన్‌షాపుల డీలర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారు. దీనికి కందుకూరులో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీగా పనిచేస్తున్న ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నారు. రేషన్‌షాపుల డీలర్లకు ఫోన్‌లు చేసి బెదిరించడం దగ్గర నుంచి.. ఫోర్జరీ సంతకాలతో డీలర్లను తొలగించడంలో ఈ అధికారే మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్నారని పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు.

బలవంతంగా రాజీనామాలు

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్‌ షాపులను చేజిక్కించుకునేందుకు పలువురు టీడీపీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలోనే అధికారులను అడ్డం పెట్టుకుని ఇప్పటి వరకు షాపులు నిర్వహిస్తున్న డీలర్లను తొలగించే కుట్రలు చేస్తున్నారు. దీనిలో భాగంగా కందుకూరు మున్సిపాలిటీలో జరుగుతున్న వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డుల్లో 26 వరకు రేషన్‌షాపులు ఉన్నాయి. ప్రస్తుతం ఈషాపులకు చెందిన డీలర్లను తొలగించి అధికార పార్టీ నేతలు తమ కార్యకర్తలకు ఇచ్చుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీగా పనిచేస్తున్న చెంచురామయ్య అనే అధికారిని అడ్డంపెట్టుకుని రేషన్‌షాపుల మార్పునకు కుట్రలు మొదలు పెట్టారు. ఈ వ్యవహారంలో డీటీనే స్వయంగా రేషన్‌షాపుల డీలర్లకు ఫోన్‌లు చేసి బెదిరింపులకు తెగబడుతున్నాడు. దీంతో ఆ అధికారి వేధింపులు తట్టుకోలేక కొందరు రేషన్‌షాపుల డీలర్లు స్వచ్ఛందంగా తమ షాపులు వదిలేసుకున్నారు. అయితే మరికొందరు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఎలా తొలగిస్తారంటూ ఆ అధికారి మాటను లెక్క చేయలేదు. దీంతో ఎలాగైనా వారిని తొలగించాలనే కుట్రతో ఆ అధికారి కుయుక్తులు పన్నుతున్నారని డీలర్లు విమర్శిస్తున్నారు.

ఫోర్జరీ సంతకాలతో తొలగింపు

ఆ డీటీ బెదిరింపులకు లొంగకుండా పట్టణంలో మొత్తం 16 మంది డీలర్లు షాపులు వదులుకునేందుకు నిరాకరించారు. దీంతో ఆ డీలర్లకు సంబంధించిన సంతకాలను ఫోర్జరీ చేసి రాజీనామా చేసినట్లు నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. ఆ మేరకు ఉన్నతాధికారులకు కూడా నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. అయితే తాము రాజీనామా చేయలేదని, తమ సంతకాలు ఫోర్జరీ చేశారంటూ కొందరు డీలర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉదాహరణకు కందుకూరు పట్టణంలోని 22వ నంబరు షాపు డీలర్‌ పిడికిటి శ్రీదేవి, 24వ నంబరు షాపు డీలర్‌ పాశం కుమారిలు తాము రాజీనామా చేయలేదని, తమ సంతకాలు ఫోర్జరీ చేసి బలవంతంగా షాపులు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని కోర్టులో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో రేషన్‌షాపుల మార్పు వ్యవహారం కందుకూరులో చర్చనీయాంశంగా మారింది. ఈ నెల రేషన్‌ సరుకుల పంపిణీ బాధ్యతలను అధికారులు అధికార పార్టీ కార్యకర్తలకు ఇచ్చేశారు. డీలర్‌ శ్రీదేవి పేరుతో షాపు ఉన్నా పంపిణీ మాత్రం టీడీపీ నేతకు అప్పజెప్పారు.

బస్తాకు నాలుగు కేజీల తేడా

అలాగే రేషన్‌ బియ్యం తూకం విషయంలో పెద్ద మోసం జరుగుతోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. ఇందులో కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీనే కీలకంగా ఉన్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీగా, సివిల్‌ సప్లై గోడౌన్‌ డీటీగా చెంచురామయ్యే కొనసాగుతున్నారు. దీంతో ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. వాస్తవానికి గోడౌన్‌ నుంచి రేషన్‌షాపులకు బియ్యం తరలించే సందర్భంలో తూకం వేసి డీలర్లకు అప్పజెప్పాల్సి ఉంటుంది. కాని ఇక్కడ అదేమి జరగడం లేదు. దీంతో 50 కేజీల బస్తాకు రెండు నుంచి నాలుగు కేజీల వరకు బియ్యం తక్కువగా వస్తున్నదని డీలర్లు ఆరోపిస్తున్నారు. ఇలా మొత్తం మీద చూస్తే 10 టన్నులు బియ్యాన్ని పంపిణీ చేసే రేషన్‌షాపునకు 8 బస్తాల వరకు బియ్యం తక్కువగా వస్తున్నాయి. అంటే దాదాపు నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని ఇవ్వాల్సిన మొత్తం కంటే తక్కువగా ఇస్తున్నారు.

నేను సంతకం చేయలేదు

మా డ్వాక్రా సంఘం తరపున నేను పట్టణంలోని 22వ నంబరు షాపు డీలర్‌గా వ్యవహరిస్తున్నాను. నా సంతకం ఫోర్జరీ చేసి నేను రాజీనామా చేసినట్లు చెప్పి షాపును లాగేసుకున్నారు. ఎవరిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. బలవంతంగా షాపులను తీసుకుంటున్నారు.

–పిడికిటి శ్రీదేవి, డీలర్‌

తూకంలో భారీ తేడా

రేషన్‌షాపునకు తోలే బియ్యం తూకంలో భారీగా తేడా వస్తోంది. బస్తాల్లోనే బియ్యం తూకం తక్కువగా వస్తున్నాయి. దీని గురించి అడిగినా పట్టించుకోవడం లేదు. అలాగే ప్రస్తుతం నా షాపును కూడా తీసుకున్నారు. నేను ఏ అధికారి వద్ద రేషన్‌ డీలర్‌గా రాజీనామా చేసినట్లు సంతకం చేయలేదు. కానీ నేను సంతకం చేసినట్లు చూపించి షాపు తీసుకున్నారు.

–పాశం కుమారి, డీలర్‌

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

- స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సమావేశంలో కలెక్టర్‌ ఆనంద్‌



జిల్లా స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ ఆనంద్‌

నెల్లూరు(దర్గామిట్ట): పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్‌ ఓ ఆనంద్‌ అన్నారు. సోమవారం కలెక్టర్‌ ఛాంబర్‌లో 2024–25 సంవత్సరానికి స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. జిల్లా స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అధికారి విజయ్‌ వినీల్‌ కుమార్‌ ప్రణాళిక ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా నిరుద్యోగులు, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించవలసిన ఆవశ్యకత ఉందన్నారు. వివిధ రంగాల్లో ఉన్నటువంటి ఉద్యోగ అవకాశాలను గుర్తించాలన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను గుర్తించి గ్రామీణ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉదయగిరి చెక్క వృత్తి కళాకారులు తయారు చేసిన స్పూన్‌, ఫోర్కులను కలెక్టర్‌కు డీఆర్‌డీఏ పీడీ అందచేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వెంకటయ్య, ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్ర, వివిధ కాలేజీల స్కిల్‌ డెవలప్‌మెంట్‌ విభాగ అధికారులు పాల్గొన్నారు.

పచ్చ నేతల బరితెగింపు

- యథేచ్ఛగా గ్రావెల్‌ అక్రమ తవ్వకాలు
- రాత్రి వేళల్లో తరలిపోతున్న ఇసుక
- మామూళ్లతో పోలీసుల మౌనముద్ర
- మెట్ట ప్రాంతంలో సహజ వనరులు దోపిడీ



వేంపాడులో ట్రాక్టర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్‌: అధికార పార్టీ అండతో మట్టి, ఇసుక మాఫియాకు జిల్లాలో చెలరేగిపోతోంది. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఎక్కడ వీలైతే అక్కడ వాలి సహజ వనరులను దోపిడీ చేస్తున్నారు. ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవాల్సిన అధికారులే వారికి రక్షణగా నిలుస్తున్నారు. దాంతో వారి అండతో టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. కొందరు స్థానిక అధికారులు జిల్లా విజిలెన్స్‌ అధికారులు దాడులకు వస్తున్నారని తెలియగానే ముందుగా అక్రమార్కులకు సమాచారం చేరవేయడంతో అక్కడ వాహనాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ తంతు ఉన్నప్పటికీ వరికుంటపాడు, ఉదయగిరి, జలదంకి మండలాల్లో మరీ ఎక్కువగా ఉంది. వరికుంటపాడు మండలం వేంపాడులో ఆదివారం రాత్రి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సోమవారం పోలీసులు పట్టుకున్నా, కొంతసేపటి తర్వాత వదలివేశారు. ఈ ఉదంతంపై పోలీసుల తీరు పట్ల స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ముడుపులు చేతులు మారినట్లు చర్చించుకుంటున్నారు. అదే విధంగా పిల్లాపేరు నుంచి రాత్రులు జేసీబీలతో ఇసుకను ట్రాక్టర్లకు లోడ్‌ చేయించి పామూరు వైపుగా తరలిస్తున్నారు. పోలీసు స్టేషన్‌ మీదుగా నిత్యం ఇసుక ట్రాక్టర్లు తరలి వెళుతున్నా రక్షక భటులు పట్టించుకోవడం లేదు. బోయమడుగు అటవీ ప్రాంతంలో ఎర్రమట్టి తరలిస్తున్నా, ఫారెస్టు అధికారులకు కనిపించడం లేదు. గేదెలు, జీవాలు మేపుకునే పశుపోషకులు అడవిలోకి వెళితే ఇబ్బంది పెట్టే అటవీ అధికారులు తమ పరిధిలో ఉన్న రిజర్వు ఫారెస్టు నుంచి తెల్లరాయి, మట్టి తరలిపోతున్నా మిన్నకుండటం వెనుక మర్మం ఏమిటో వారికే తెలియాలి. ఉదయగిరి పెద్ద, చిన్న చెరువుల నుంచి మట్టి ఇటుక బట్టీలకు తరలిపోతున్నా అటు ఇరిగేషన్‌, పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం అన్ని శాఖల అధికారులకు బదిలీలు ఉండటంతో సందట్లో సడేమియా అన్నట్లు మామూళ్లు తీసుకొని ఏమీ ఎరుగనట్టుగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది అధికారులను ఇదే విషయమై వివరణ అడిగినప్పుడు అధికార పార్టీ ఒత్తిళ్లు తట్టుకోలేకపోతున్నాం. నాలుగు రోజుల్లో మేము బదిలీ అయిపోతాం. మమ్మల్ని వదలేయండి అని ముక్తసరిగా జవాబిస్తున్నారు. ఈ అక్రమ రవాణా మాఫియాను జిల్లా అధికారులు ఎలా అరికడతారో వేచి చూడాలి.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్‌ ఆనంద్‌



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్‌ ఆనంద్‌

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్‌ ఒ.ఆనంద్‌ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఇంటిగ్రేటెడ్‌ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, పెన్నానది పరీవాహక మండలాల్లో కరకట్ట ఆక్రమణల తొలగింపు, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, కౌలు రైతులకు సీసీఆర్‌ కార్డుల పంపిణీ, ఎస్టీలకు బర్త్‌ సర్టిఫికెట్లు, ఆధార్‌ కార్డుల మంజూరు, సీజనల్‌ వ్యాధుల నివారణ, వచ్చే నెల 1న పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనిదినాల పెంపు, పాఠశాలల్లో నాడు–నేడు పనుల పురోగతి తదితర అంశాలపై సబ్‌ కలెక్టర్‌, ఆర్డీఓలు, మున్సిపల్‌ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్‌ శంకరన్‌ హాల్లో కలెక్టర్‌ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు రీఓపెన్‌ కాకుండా నిర్దిష్ట గడువు లోపు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల వారీగా ఆయకట్టు వివరాలు సేకరిస్తే.. ఎంతమేర పొలాలకు నీరు అవసరమో తెలుసుకుని ఐఏబీ సమావేశంలో చర్చించి ఆ మేరకు నీరు విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పెన్నానది కరకట్ట ఆక్రమణలను తొలగించాలని, సీజనల్‌ వ్యాధుల వ్యాప్తి దృష్ట్యా ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, డీఆర్‌ఓ లవన్న, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సోమశిలకు కృష్ణా జలాల కోసం కసరత్తు



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా వరప్రసాదిని సోమశిల జలాశయానికి కృష్ణా జలాలు వచ్చేనా, పంటలు పండేనా అన్న మీమాంసంలో ఉన్న రైతులకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ నుంచి కృష్ణా జలాలు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ ద్వారా 18 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఈ నీరు బనకచర్ల డ్యాంకు చేరుకుంటోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని సోమశిల జలాశయం అడుగంటుతోంది. సోమశిల జలాశయం డెడ్‌స్టోరేజ్‌కు చేరుకుని ఇటీవల పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల కాస్త నీటి నిల్వ చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలో 9.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు నుంచి బనకచర్ల డ్యాం ద్వారా కుందూ నదికి చేరుకుంటే దాని ద్వారా పెన్నానదికి చేరుకుని ప్రవాహం ప్రారంభమవుతుంది.

కృష్ణా జలాలు వదలాలని కోరాం

పోతిరెడ్డిపాడు హెడ్‌ రెగ్యులేటర్‌ ద్వారా మూడు రోజులుగా 18 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వీటితో పాటు అక్కడి నుండే సోమశిల, కండలేరు జలాశయాలకు నీటి ఆవశ్యకత దృష్ట్యా కృష్ణా జలాలు విడుదల చేయాలని కోరాం. పోతిరెడ్డిపాడు ద్వారా గరిష్టంగా సోమశిలకు 12 వేల క్యూసెక్కుల వరకు రోజుకు వచ్చే అవకాశముంది.

– బసిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఎస్‌ఈ, సోమశిల ప్రాజెక్ట్‌

విద్యార్థి మృతి ఘటనపై విచారణ సాగతీత!

నెల్లూరు (టౌన్‌): స్థానిక కేఎన్నార్‌ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి గురు మహేంద్ర సన్‌షేడ్‌ కూలి మృతి చెందిన ఘటనలో బాధ్యులపై చర్యలు ఉండేనా అన్న అనుమానం కలుగుతోంది. జిల్లా విద్యాశాఖాధికారులు బాలుడు మృతి చెంది 5 రోజులవుతున్నా విచారణ పేరుతో సాగతీస్తున్న వైనంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. పాఠశాల లంచ్‌, లాస్ట్‌బెల్‌ సమయంలో అక్కడ పనిచేసే ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్లేదాక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నిర్మాణంలో ఉన్న భవనంలోకి విద్యార్థులు వెళుతున్నా హెచ్చరించిన సందర్భాలు ఉండటం లేదని చెబుతున్నారు. నగరంలోని పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణకు అదే డివిజన్‌కు చెందిన డిప్యూటీ డీఈఓను విచారణాధికారిగా నియమించడంపై కూడా విమర్శలు వస్తున్నాయి. నివేదకను సానుకూలంగా ఇవ్వాలని ఆమెపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. బాలుడు మృతి ఘటనలో బాధ్యులను చేయకుండా ఉండేందుకు రెండు రోజుల క్రితం కేఎన్నార్‌ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయులు టీడీపీ రూరల్‌ ఎమ్మెల్యేను కలిసినట్లు సమాచారం. ఆయన నుంచి హామీ కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు.

డీఈఓకు నివేదిక

సోమవారం సాయంత్రం నెల్లూరు డివిజన్‌ డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి డీఈఓ రామారావుకు నివేదిక అందజేసినట్లు తెలిసింది. అయితే కలెక్టర్‌ బిజీగా ఉండటంతో నివేదిక ఇవ్వడానికి కుదరలేదని సమాచారం. డీఈఓ రామారావు ఆర్జేడీ హియరింగ్‌ ఉండటంతో విజయవాడ వెళుతున్నట్లు చెబుతున్నారు. ఆయన రెండు రోజుల పాటు అక్కడే ఉంటారు. రెండు రోజుల పాటు ఏడీ గ్లోరికుమారికి ఇన్‌చార్జి డీఈఓగా బాధ్యతలు అప్పగించారు. ఆయన తిరిగి వచ్చిన తరువాత రిపోర్ట్‌ను కలెక్టర్‌కు అందజేస్తారా లేక ఏడీ గ్లోరికుమారితో కలెక్టర్‌కు అందజేస్తారా అనేది వేచి చూడాల్సిందే. విద్యార్థి గురు మహేంద్ర కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పినా ఇప్పటికీ ఇవ్వలేదు.

నాసిరకం నిర్మాణం

కేఎన్నార్‌ పాఠశాలలో నాడు–నేడులో భాగంగా అదనపు తరగతులు నిర్మాణం నాసిరకంగా జరుగుతున్నట్లు చెబుతున్నారు. నాడు–నేడు పనులు పాఠశాల కమిటీ, ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు, పాఠశాల హెచ్‌ఎం పర్యవేక్షణలో జరుగుతాయి. అక్కడ నిర్మాణ పనులు హెడ్‌మాస్టర్‌ దగ్గర ఉండి చూసుకోవాలి. ఆయన సంతకం ఉంటేనే బిల్లులు మంజూరు అవుతాయి. అయితే అదనపు తరగతుల నిర్మాణంపై విజిలెన్స్‌ అధికారులతో విచారణ చేయించినట్లయితే నాడు–నేడు పనుల్లో జరిగిన అవినీతి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీని ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చు.

డీసీపల్లిలో 547 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 547 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్‌ తెలిపారు. వేలానికి 590 బేళ్లు రాగా వాటిలో 547 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 70,055 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,97,20,411ల వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.358 కాగా కనిష్ట ధర రూ.205 లభించింది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సైలు అటాచ్‌మెంట్‌

నెల్లూరు(క్రైమ్‌): జిల్లాలో వీఆర్‌లో ఉన్న పదకొండు మంది ఎస్‌ఐలను వివిధ పోలీసు స్టేషన్‌లకు అటాచ్‌ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్‌ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే తమకు కేటాయించిన పోలీసు స్టేషన్‌లలో విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎస్సై	ప్రస్తుతం	అటాచ్‌మెంట్‌
బి. వెంకటేశ్వర్లు	వీఆర్‌	డీసీఆర్‌బీ
ఎస్‌డీ అబ్దుల్‌ రహీమ్‌	వీఆర్‌	సీసీఎస్‌
వి.తిరుపతయ్య	వీఆర్‌	డీటీసీ
వీసీ హెచ్‌ సుబ్రహ్మణ్యం	వీఆర్‌	చిన్నబజార్‌
కె.ఎడ్వర్డ్‌	వీఆర్‌	కందుకూరు టౌన్‌
కె.బాలకృష్ణయ్య	వీఆర్‌	కావలి రూరల్‌
ఎల్‌.రాములు	వీఆర్‌	వలేటివారిపాలెం
వి.మాల్యాద్రి	వీఆర్‌	సౌత్‌ ట్రాఫిక్‌
వి.వెంకటేశ్వర్లు	వీఆర్‌	కావలి 2 టౌన్‌
కె.వెంకటాద్రినాయుడు	వీఆర్‌	సీసీఎస్‌
టి.వెంకటేశ్వర్లు	వీఆర్‌	డీఎస్‌బీ

ఊరెళ్లారు.. దోచేశారు

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ డ్రైవర్ కుటుంబంతో కలిసి వేలూరులోని ఆస్పత్రికి వెళ్లారు. దుండగులు అతని ఇంట్లోని నగలు, నగదు అపహరించుకెళ్లారు. ఈ ఘటన వెంకటేశ్వరపురంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటేశ్వరపురం డాన్‌బాస్కో స్కూల్ సమీపంలో ఆర్టీసీ డ్రైవర్ నాగేశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 24వ తేదీన ఆమెను చికిత్స నిమిత్తం వేలూరులోని సీఎంసీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు నాగేశ్వరరావు ఇంటి తాళం పగులగొట్టి రూ.25 వేల నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలను దొంగతనం చేశారు. సోమవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చిన బాధితుడు నగలు, నగదు చోరీ అయినట్లు గుర్తించి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమస్యలపై వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అధికారులకు 223 అర్జీల అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): 'చాలా దూరం నుంచి వచ్చాం సార్.. మా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించండి' అని ప్రజలు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు క్యూ కట్టారు. కలెక్టర్ ఒ.ఆనంద్, ఇతర అధికారులు వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 223 అర్జీలొచ్చాయి. అందులో ప్రధానంగా రెవెన్యూకు సంబంధించి 124, మున్సిపల్‌వి 18, పంచాయతీ రాజ్‌వి 15, పోలీస్ శాఖవి 13 అర్జీలున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సాంబశివారెడ్డి, వివిధ శాఖల అధికారులు పెంచలయ్య, చందర్, హేనాసుజన్, వెంకటయ్య, దయాకర్, సత్యవాణి, కృష్ణమోహన్, వెంకటరమణ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

➡ పలు మండలాల్లో మహ్మద్‌లకు బీసీ–ఈ ధ్రువీకరణపత్రాలు ఇవ్వడం లేదు. స్కూళ్లలో సైతం మహ్మద్ ఉంటే ఓసీ అని రాస్తున్నారు. వీటిపై వీఆర్వోలకు వివరించినా ఓసీగా సర్టిఫికెట్ ఇస్తామని అంటున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి' అని ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ నజీర్‌బాషా, సర్దార్ అహ్మద్, ఇషాక్, రెహ్మాన్ కోరారు.

➡ శ్రీశైలం జలాశయం నుంచి సోమశిల, కండలేరు జలాశయాలకు నీటి కేటాయింపులు చేయాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల సాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం అధికారికంగా నీటి కేటాయింపులు చేపట్టాలని ఆయన అన్నారు.

➡ వేతనాలు చెల్లించాలని ఏపీఎస్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలకు చెందిన కొందరు వినతిపత్రాన్ని అందజేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ధర్నా

ఉపాధి హామీ పథకంలో 17 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలంటూ ఏపీ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్‌ఏ) యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రమాదవశాత్తు ఎఫ్‌ఏ మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అర్హత ఉన్న వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. ఉపాధి పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.



మోసగించారు.. న్యాయం చేయండి

- పోలీస్ అధికారులకు సమస్యల నివేదన
- పరిశీలించి న్యాయం చేస్తాం
- ఎస్పీ జి.కృష్ణకాంత్ హామీ

నెల్లూరు(క్రైమ్): 'ఉద్యోగాల పేరుతో భారీ మొత్తంలో నగదు తీసుకుని మోసం చేశారు. మీరు పరిశీలించి న్యాయం చేయండి' అని కొందరు బాధితులు పోలీసు అధికారులను కోరారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 'క్షేత్రస్థాయిలో కాళ్లరిగేలా తిరిగినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. మీరైనా మా మొర ఆలకించి తగిన చర్యలు తీసుకోండి సార్..' అంటూ బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్, పోలీస్ ఉన్నతాధికారులను వేడుకున్నారు. చట్టపరిధిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 110 మంది నుంచి అధికారులు వినతులను స్వీకరించారు. వాటిని ఆయా ప్రాంతాల పోలీసులకు అప్పగించారు. నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ క్రైమ్స్ ఏవీఆర్‌బీపీ ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారి, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ, అధికారులు

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ నెల్లూరు పోలీసు కాలనీకి చెందిన ఓ మహిళ తన తండ్రి మృతిపై అనుమానాలున్నాయని, పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

➡ అనంతసాగరానికి చెందిన ఖాజామొహిద్దీన్ ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.9.40 లక్షలు తీసుకున్నాడని అదే ప్రాంతానికి చెందిన వీరారెడ్డి ఫిర్యాదు చేశారు.

➡ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ఉలవపాడుకు చెందిన వ్యక్తి రూ.7 లక్షలు తీసుకుని తనను మోసగించాడని అదే ఊరికి చెందిన తేజ వినతిపత్రం అందజేశారు.

➡ అదనపుకట్నం కోసం అత్త, మామ, భర్త వేధింపులకు గురిచేసి ఇంట్లో నుంచి గెంటేశారని నెల్లూరు బీవీనగర్‌కు చెందిన మహిళ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

➡ భర్త చెడువ్యసనాలకు బానిసై వేధిస్తున్నాడని ఇందుకూరుపేటకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

➡ ప్రేమిస్తున్నానని నమ్మించి సన్నిహితంగా మెలిగిన వ్యక్తి పెళ్లికి నిరాకరించాడని అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నెల్లూరు నగరానికి చెందిన ఓ యువతి ఫిర్యాదు చేశారు.

➡ ఇంట్లో ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని నెల్లూరు వేదాయపాళేనికి చెందిన నారాయణమ్మ, తమ ఇంట్లో 20 సవర్ల బంగారు ఆభరణాలను దుండగులు దొంగతనం చేసినట్లు కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డుకు చెందిన సూర్యనారాయణ వినతులిచ్చారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

➡ కొడుకు, కోడలు పట్టించుకోకుండా వేధిస్తున్నారని కొడవలూరుకు చెందిన సుబ్బరత్నమ్మ, ముత్తుకూరుకు చెందిన సుబ్బమ్మలు పోలీసుల దృష్టికి తెచ్చారు.

చోరీలు పెరిగాయి

'ఇటీవల దొంగతనాలు అధికమయ్యాయి. ప్రజలు కష్టపడి సంపాదించి దాచుకున్న సొత్తును దుండగులు కొల్లగొడుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలి' అని సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్ మాట్లాడుతూ నెల్లూరులోని సంతపేట, ఆజాద్ సెంటర్, ప్రగతి నగర్, జెండావీధి తదితర ప్రాంతాల్లో సింగిల్ నంబర్లాట జోరుగా సాగుతోందన్నారు. స్థానిక పోలీసులకు తెలిసినా నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల అప్పులపాలై అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరాలను కట్టడి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, లతీఫ్, అహ్మద్, రియాజ్, షాకీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు



బంగారం కొనుగోలుకు వెళ్లగా..

- రూ.2.12 లక్షల చోరీ

ఉలవపాడు: బంగారు నగలు కొనడానికి వచ్చిన మహిళ వద్ద నుంచి గుర్తుతెలియని మహిళ నగదు అపహరించింది. ఈ ఘటన మండల కేంద్రమైన ఉలవపాడులోని మాబు సుభాని జ్యువెలర్స్ వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని పెదపట్టపుపాళేనికి చెందిన కొండూరి ఈశ్వరమ్మ నెల క్రితం బంగారు ఆభరణం చేయించుకోవడానికి సుభాని షాపులో ఆర్డర్ ఇచ్చింది. అది పూర్తవడంతో తీసుకునేందుకు సోమవారం తన తల్లి పోలమ్మతో కలిసి వెళ్లింది. తాను కట్టాల్సిన రూ.2.12 లక్షలను క్రసంచిలో పెట్టుకుంది. దుకాణంలో జనం ఉండడంతో బయట చెక్కబల్లపై కూర్చొంది. వీరి పక్కనే స్కార్ఫ్ కట్టుకున్న మరో మహిళ ఉంది. కొద్దిసేపటి తర్వాత సంచిలో డబ్బులు కనిపించలేదు. దానిని కత్తితో కోసి ఉంది. నగదు చోరీకి గురైందని తెలుసుకున్న బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై బాజిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దుకాణంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహితపై హత్యాయత్నం కేసులో..

- భర్తకు ఐదేళ్ల జైలుశిక్ష

నెల్లూరు(లీగల్): ఓ వ్యక్తి తన భార్యపై హత్యాయత్నం చేశాడు. ఈ కేసులో అతడికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా (మహిళ) కోర్టు న్యాయమూర్తి జి.గీత సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఉదయగిరి మండలం చొడేపల్లి గ్రామానికి చెందిన అరుణకు జెట్టివారిపల్లి వాసి అయిన బురాగా వెంకటేశ్వర్లుకు 2002లో పెద్దలు వివాహం చేశారు. వీరికిద్దరు సంతానం. చెడు అలవాట్లకు బానిసైన వెంకటేశ్వర్లు తరచూ తాగొచ్చి భార్యను ఇబ్బంది పెట్టేవాడు. అనుమానం పెంచుకుని మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. దీంతో ఆమె ఇద్దరు పిల్లలను తీసుకుని తన తల్లి ఇంటికి వెళ్లిపోయింది. కొంతకాలానికి ఇద్దరూ కోర్టులో రాజీ పడ్డారు. 2017 సంవత్సరం అక్టోబర్ 30వ తేదీన రాత్రి 9 గంటల ప్రాంతంలో వెంకటేశ్వర్లు, తన అన్న కుమారుడు హరికృష్ణతో కలిసి చొడేపల్లి గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో అరుణ అక్కడే ఉంది. అప్పటికే వెంకటేశ్వర్లు మద్యం మత్తులో ఉన్నాడు. భార్యను తనతో రావాలని చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో అతను భార్య, అత్తను తిడుతూ మంచం కర్రతో దాడి చేశాడు. వెంకటేశ్వర్లు, హరికృష్ణ అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు తీవ్రంగా గాయపడిన అరుణను ఉదయగిరి ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. మరుసటిరోజు బాధితురాలు పోలీసు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో ఇద్దరిపై చార్జిషీట్ దాఖలు చేశారు. వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో పైమేరకు జైలుశిక్ష, జరిమానా విధించారు. రెండో నిందితుడిపై నేరం రుజువు కాకపోవడంతో అతడిపై కేసును కొట్టేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీ ప్రసాద్ వాదించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 162

